## క్లుప్తంగా

### నాదెండ్లలో కాలువ నిర్మాణంపై వాగ్వాదం



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల రామాపురం కాలనీ ఉత్తరం వైపు సైడు కాల్వలో నీరు పారుదల లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారంటూ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదులు అందాయి. మురుగునీరు పంటపొలాల్లోకి వెళ్తున్నదని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. దీంతో పంచాయతీ కార్యదర్శిమక్కెన సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు పరిశీలించారు. శాశ్వతంగా సైడుకాల్వలు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. కాలనీకి చెందిన వెంకటరావు అనే వ్యక్తి తన ఇంటి ముందు తాను కాలువ నిర్మించుకున్నానని, కాలువ తొలగించేందుకు వీలులేదని వాగ్వాదానికి దిగాడు. దీంతో పంచాయతీ అధికారులు పోలీసులకు సమాచారమివ్వటంతో ఎస్సై జి పుల్లారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంకటరావుతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఇంటిముందు తాను నిర్మించుకున్న సైడు కాల్వను తొలగించి రోడ్డు వెడల్పుగా వేసేందుకు అంగీకరించాడు.

### మరిన్ని మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం



నరసరావుపేట: వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో మరిన్ని మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ మాధురి పేర్కొన్నారు. మంగళవారం పల్నాడురోడ్డు బ్రాంచ్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. డిప్యూటీ రీజనల్ హెడ్ మురళీమోహన్, సోమేశ్వరరావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జీఎస్ రాంప్రసాదు, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



వినుకొండ: పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ పీటీడీ, నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 2వ రోజైన మంగళవారం వినుకొండ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ అమలు, ట్రాన్స్‌ఫర్ పాలసీ, అక్రమ సస్పెన్షన్‌లు, రిమూవర్స్, మహిళలకు చైల్డ్ కేర్ సెలవులు, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత పద్ధతిలో వైద్యం, డిప్యూటేషన్ విధానం కొనసాగింపు, ఆగిపోయిన ప్రమోషన్లు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ కార్యదర్శి వీఎస్‌పీ నాయక్, ముప్పాళ్ల శ్రీను, ఆర్. శ్రీను, మస్తాన్, సీతారెడ్డి, రామారావు, కృపారావు, ఇజ్రాయేల్, కీర్తి, విజయలక్ష్మి, మేరికుమారి, రేవతి దీక్షలో పాల్గొన్నారు.

### కిశోర వికాసంలో శ్రద్ధగా పనిచేయాలి



నాదెండ్ల: కిశోర వికాసం పట్ల కమిటీలు శ్రద్ధగా పనిచేసి వారికి తగు సూచనలు ఇవ్వాలని సీడీపీవో శాంతకుమారి చెప్పారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గ్రామ, వార్డు కిశోర వికాస కమిటీలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది వేసవిలో మే 1 నుంచి 16 వరకూ హెల్పర్లకు, 17 నుంచి 30 వరకూ టీచర్లకు సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో వారి బాధ్యతలను నెరవేర్చాలన్నారు. బాలికల హక్కుల గురించి వివరించారు. కిశోర వికాస కమిటీల్లో ఎంఎస్‌కే కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, సభ్యులుగా అంగన్‌వాడీ టీచర్, ఎంఎల్‌హెచ్‌పీ, వీవోఏ, ఆశ వర్కరు సభ్యులుగా ఉంటారన్నారు. నెలకు మూడు పర్యాయాలు ఆయా ప్రాంతాల్లోని 18 ఏళ్ల లోపు బాలికలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిరక్షణ పట్ల తగు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నిర్మలారాణి, సూపర్‌వైజర్ నిర్మల కృష్ణమాల పాల్గొన్నారు.

### గుంటుపాలెం సర్పంచ్‌గా ఆంజనేయులు

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా మద్దినేని ఆంజనేయులు మంగళవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. ప్రస్తుతం ఉన్న గ్రామ సర్పంచ్ అందుబాటులో లేనందున ఉప సర్పంచ్ మద్దినేని ఆంజనేయులకు అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు.

# విజ్ఞాన శిబిరమా... నీవెక్కడా?

- వారానికి ఒక్కరోజు గ్రంథాలయ నిర్వాహకుడి విధులు!
- నిర్వహణ లేక పాఠకులు దూరం

నూజెండ్ల: సోమవారం నుంచి ప్రారంభమైన గ్రంథాలయాల వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించిన దాఖలాలు లేవు. మండల కేంద్రమైన నూజెండ్లలో గ్రంథాలయ దుస్థితి ఇది. ప్రారంభంలో ఓ దాత ఇచ్చిన భవనంలో గ్రంథాలయం ప్రారంభించారు. తొలత గ్రంథాలయ నిర్వాహకుడు సైతం స్థానికంగా ఉంటూ విధులు నిర్వహించటంతో పాఠకుల సంఖ్య ఎక్కువగా ఉండేది. రానురాను కొత్త పుస్తకాలు కొనుగోలు చేయకపోవటం, ఉన్నవి శిథిలావస్థకు చేరాయి. గతంలో పనిచేసిన లైబ్రేరియన్ బదిలీ కావటం అతని స్థానంలో ఇన్‌చార్జ్ నిర్వాహకుడు రావటం, అతనూ వారానికి ఒకసారి వచ్చేలా అధికారులు ఏర్పాటు చేయటంతో గ్రంథాలయ నిర్వహణ దిగజారిపోయింది. దాతలు కేటాయించిన భవనం సైతం శిథిలావస్థకు చేరటంతో గ్రామంలోని పాత పంచాయతీ భవనంలోకి గ్రంథాలయాన్ని మార్చారు. నూతన భవనం ఒక గదిలో ఆధార్ సెంటర్ నిర్వహిస్తూ ఉండటంతో గదులు ఇరుకుగా మారాయి. ప్రతీ రోజూ వార్తాపత్రికలు వస్తున్నప్పటికీ బల్లలు, కుర్చీలు లేక చదువుకునేందుకు సౌకర్యంగా ఉండకపోవటంతో పాఠకులు ఆ వైపు తొంగి చూడటం లేదు. గ్రంథాలయం బోర్డు సైతం లేకపోవటంతో లైబ్రరీ ఉనికే విద్యార్థులకూ తెలియటం లేదు. దీంతో విద్యార్థులు పుస్తక పఠనం నుంచి సెల్‌ఫోన్ బలహీనతకు అలవాటు పడుతున్నారు. వేసవి శిబిరాల దృష్ట్యానైనా జిల్లా అధికారులు స్పందించి పూర్తి స్థాయి విధులు నిర్వహించే నిర్వాహకుడిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





గ్రంథాలయం నిర్వహిస్తున్న పాత పంచాయితీ భవనం



ఖాళీగా ఉన్న గ్రంథాలయం

**నిర్వాహకుడి పోస్టు భర్తీ కాలేదు**

విజ్ఞాన భాండాగారాలుగా పిలుచుకుంటున్న గ్రంథాలయాలు ప్రసంగాలకే పరిమితమవుతున్నాయి. దశాబ్దాల కాలంగా నిర్వాహకుడి పోస్టు భర్తీ కాకపోవటం, పుస్తకాల సంఖ్య పెంచకపోవటం, ఉన్నవి శిథిలావస్థకు చేరటంతో గ్రంథాలయాలకు వేళ్లే పుస్తక ప్రేమికుల సంఖ్య క్రమేపీ తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత తరం విద్యార్థులకు స్థానికంగా గ్రంథాలయం ఉన్న సంగతే తెలియని పరిస్థితి ఏర్పడటం బాధాకరం.

### మాకు తెలియదు



గ్రామంలో గ్రంథాలయం ఉన్న సంగతి మాకు తెలియదు. వేసవి సెలవుల్లో పాఠ్యాంశేతర పుస్తకాలు చదివి జ్ఞాన సముపార్జనకు అవకాశం లేకుండా పోయింది.

– యద్దనపూడి ధనుష్, విద్యార్థి, నూజెండ్ల

### వార్తా పత్రికలు మిస్సవుతున్నాం!



బోధనేతర అంశాలపై ఆసక్తి ఉన్నప్పటికీ అందుబాటులో గ్రంథాలయం లేకపోవటంతో వార్తా పత్రికలు చదువుకోలేక పోతున్నాం. కాలక్షేపం కోసం మొబైల్‌కు అలవాటు పడాల్సి వస్తోంది.

–బొల్లినేని హరిబాబు, విద్యార్థి, నూజెండ్ల

# ఇళ్లు, స్థలాల సమస్యను పరిష్కరించాలి

- ఉల్ఫా కంపెనీలకు భూములు కేటాయించటం మానుకోండి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు





మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రజలు ఇళ్లు, స్థలాల సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం ఆ సమస్యను తీర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని కోటప్పకొండరోడ్డులో నూతనంగా నిర్మించిన పార్టీ జిల్లా కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలు రోడ్డుసైడు, కాల్వగట్లు, చెరువులు, పోరంబోకు స్థలాల్లో ఎక్కడ ఖాళీగా ఉంటే గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. అలాంటి వారికి గత ఎన్నికల్లో నగరాలు, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడుసెంట్లు ఇస్తామని కూటమి నాయకులు వాగ్దానం చేశారన్నారు. అయితే పది నెలలు గడుస్తున్నా స్థలాలు ఇచ్చేందుకు ఎక్కడా సర్వే చేయలేదని అన్నారు. పీ–4, నిరుద్యోగ సర్వేలు చేసిన ప్రభుత్వం ఇళ్లపట్టాలులేని వారిని గుర్తించేందుకు సర్వే చేసి పట్టాలు అయినా ఇవ్వాలని, లేదా ప్రభుత్వమే స్థలాలు గుర్తించి ఇళ్లు కట్టించి అయినా ఇవ్వాల్సి ఉందన్నారు.

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలు కట్టించిందని, అవి ఇప్పటికీ పూర్తికాలేదని, బ్యాంకుల నుంచి లబ్ధిదారులకు నోటీసులు అందుతున్నాయని, ఇళ్లు లేక అద్దెలు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. అప్పటి ఐదేళ్లు, ఇప్పుడు ఒక ఏడాది పూర్తయినా ఆ నిర్మాణాలలో మొక్కలు మొలిచి, గ్లాసులు పగిలి ఆయుష్షు సగానికి సగం పడిపోయిందన్నారు. ప్రభుత్వం చెప్పే మాటలకు చేసే పనులకు సంబంధం లేకుండా ఉందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో 700 నుంచి 800 మందిని ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న వారిని బలవంతంగా తరిమివేశారన్నారు. ఉపసభాపతి, స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు తాము మిగతావి కూడా కూల్చివేస్తామని బహిరంగంగానే చెబుతున్నారని, కూల్చివేయటమే ప్రభుత్వ పనా, విధ్వంసాలే చేస్తారా, ప్రత్యామ్నాయం చూపరా, పేదలను నిరాశ్రయులు చేయటం న్యాయమా అని ప్రశ్నించారు. కృష్ణానదిపై నాలుగు ఐదు బ్రిడ్జీలు నిర్మాణం చేస్తామంటున్నారని అవికేవలం రియల్ ఎస్టేట్ కోసమేనని అన్నారు.

**ఉగ్రవాది దాడి హేయమైనది**

పహల్గాం ఉగ్రవాదుల దాడులు అత్యంత హేయమైన చర్య అని, ఈ దాడులను కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పార్టీ శాఖ కార్యదర్శిల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన నూతనంగా నిర్మించిన పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయులునాయక్, అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, జి.రవిబాబు, సీనియర్ నాయకులు ఏవీకె దుర్గారావు, షేక్.సిలార్ మసూద్, డి.శివకుమారి, మల్లీశ్వరి, కామినేని రామారావు అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### నల్లగార్లపాడు పొలంలో అగ్నిప్రమాదం

రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామ పొలాల్లో అగ్నిప్రమాదం సంభవించింది. మొక్కజొన్న హార్వెస్టింగ్ చేసిన పొలానికి నిప్పు అంటుకోవడం వల్ల మంటలు పొలం పైకీ ఎగబాకాయి. దీనిని గమనించిన రైతులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పివేశారు. మంటలు ఆర్పివేయటం ఆలస్యమైతే పొలంలో ఉన్న మొక్కొజొన్న, వరిగడ్డి, పశుగ్రాసం తదితరాలు మంటల్లో తగలబడేవి. మంటలు ఆగి పోవటంతో పెను ప్రమాదం తప్పింది.

### విలువైన వరిగడ్డివామి దగ్ధం



నాదెండ్ల: సాతులూరు గ్రామంలోని చెరువు కట్ట సమీపంలో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడు వజ్జా రత్నారావు తెలిపిన వివరాల మేరకు ఇటీవల తాను 15 ఎకరాలు వరిగడ్డిని రూ.1.20 లక్షలకు కొనుగోలు చేసి వామి ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వామికి నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైందని వాపోయాడు. చిలకలూరిపేట అగ్నిమాపక అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, సిబ్బందితో వచ్చి మంటలను ఆర్పారు. ప్రొక్లెయినర్ సాయంతో వామిని తొలగించి ఇతర వామిలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. గతేడాది ఇదే సమయంలో తన వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని బాధితుడు వాపోయాడు.

### సర్వే పనులు వేగవంతం చేయాలి



నూజెండ్ల: భూసర్వే పనులకు రైతులు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని పాత ఉప్పలపాడు గ్రామ సచివాలయంలో సర్వే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో 3963 ఎకరాలు సర్వే చేయాల్సి ఉందన్నారు. ఇందుకు గాను 20 మంది సర్వేయర్ల బృందాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అరవై రోజుల్లోగా సర్వే పూర్తి చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చండీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

### వసతిగృహ విద్యార్థులకు డైట్‌చార్జీలు పెంచాలి



నాదెండ్ల: వచ్చే విద్యా సంవత్సరం నుంచి పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వసతి గృహాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలని భారతరాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. కనపర్రు శివారు మైనంపాడులో మంగళవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యతో పాటూ పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న కమాటీ, వాచ్‌మెన్, కుక్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. వారికి కనీస వేతనాలు అమలు చేయటంతో పాటూ, అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద డిప్యూటేషన్ చేసే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. హాస్టల్స్‌లో నాణ్యమైన బియ్యం సరఫరా చేసి వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎం.నరేష్, కె.బాలస్వామి, ఎం.పవన్, బి.బాబ్జీ ఉన్నారు.

### వైభవంగా మద్దిరాలమ్మ తల్లి తిరునాళ్ల వేడుకలు



ఈపూరు(శావల్యాపురం): మండలంలోని కొండ్రముట్లవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న మద్దిరాలమ్మ తల్లి తిరునాళ్ల వేడుకలు మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల వేడుకలు సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు.ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు విద్యుత్ ప్రభలను సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులు ఏర్పాటు చేశారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, ఎస్సై యం.ఉమామహేశ్వరరావు తన సిబ్బంది పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

### వేమన పద్యాలతో విజ్ఞానం

నాదెండ్ల: విద్యార్థులు వేమన శతకంలోని పద్యాలు, వాటి తాత్పర్యాలను అర్థం చేసుకుంటే ఎంతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం వేమన శతకం బోధించారు. విద్యార్థులతో వేమన పద్యాలు, వాటి తాత్పర్యాలు చెప్పించారు. పాఠ్య పుస్తకాల పఠనంతో పాటూ విజ్ఞానాన్ని పెంపొందించే దేశనాయకుల జీవిత విశేషాలు, చరిత్ర వంటివి అధ్యయనం చేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ ఐదేళ్ళ నుంచి పదిహేనేళ్ల లోపు వయస్సు గల చిన్నారులను తల్లిదండ్రులు విజ్ఞాన శిబిరాలకు పంపాలని కోరారు.

# అంజిరెడ్డి హాస్పిటల్స్ అధినేతకు ఘన సన్మానం

**సన్మానించిన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు**



డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరించిన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు

నరసరావుపేట: గణనీయమైన వైద్య సేవలు అందించడంలో రికార్డుస్థాయి సక్సెస్‌రేట్, ఉన్నతమైన ప్రమాణాలతో డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ గుర్తింపు తెచ్చుకుందని మార్టూరుకు చెందిన ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలోని పలుప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు చేసి ఉన్నతస్థాయి సక్సెస్ రేటుతో రికవరీ చేసి డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా ఉచిత వైద్యసేవలు అందించి వారిజీవితాలను వెలుగులోకి తీసుకొచ్చిన సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం హాస్పిటల్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. మార్టూరు పీఎంపీ ఆర్ఎంపీ యూనియన్ అధ్యక్షులు పీర్ భాషా, వెంకటేశ్వరరావు, గ్రామీణ వైద్య మిత్రులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంచినీటి సరఫరాపై మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందితో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్యపై అధికారులు, సిబ్బంది స్పందించకపోతే వారిని ఇంటికి పంపటం తప్ప మరో మార్గం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చే వరకు అధికారులు నీటి సరఫరా విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధి లేని వారిని సహించేది లేదని హెచ్చరించారు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ప్రజలకు సరఫరా చేయలేకపోవడం తీవ్ర అసమర్థత అని పించుకుంటుందని ఆసహనం వ్యక్తం చేశారు. నీటి సరఫరాలో సమన్వయ లోపాలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా సమస్య తెలిసిన వెంటనే దాని పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ పరిధిలో ఏ వార్డులో నైనా, మండలాల పరిధిలో ఏ గ్రామంలో నైనా పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేయలేని పరిస్థితులు ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. పట్టణ పరిధిలో పైపుల ఇంటర్ లింకేజ్ పనులు వేగవంతం చేయాలన్నారు. వేసవిలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జగజ్జీవన్ రామ్ పాత్రధారికి సత్కారం



కలెక్టర్ అరుణ్‌బాబును కలిసిన దిలీప్‌రాజా

నరసరావుపేట: నిర్మాణంలో ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ సినిమాలో టైటిల్ రోల్ పోషిస్తున్న నటుడు మిలటరీ ప్రసాద్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మంగళవారం తన కార్యాలయంలో దుశ్శాలువాతో సత్కరించారు. భారత పార్లమెంట్ చరిత్రలో 40 ఏళ్లు పార్లమెంట్ సభ్యుడిగానూ, 30 ఏళ్లు కేంద్రమంత్రిగా విశేష సేవందించిన రికార్డును స్వర్గీయ బాబుజగజ్జీవనరామ్ సొంతం చేసుకున్నారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాంటి మహనీయుని జీవితచరిత్రను వెండితెరకెక్కిస్తున్న దర్శకుడు దిలీప్ రాజాను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం చిత్ర యూనిట్ జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నటుడు మిలటరీ ప్రసాద్‌ను చూస్తుంటే జగజ్జీవన్‌రామ్‌ను చూసిన అనుభూతి కలిగిందని జిల్లా కలెక్టర్ కితాబిచ్చినట్లుగా దర్శకుడు మీడియాకు తెలిపారు.

# తెలుగు సాహిత్యానికి సూర్యుడు మహాకవి శ్రీశ్రీ

**శ్రీనాథ సాహితీ కళా పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ జయంతి**



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మస్తాన్‌రెడ్డి, చినరామిరెడ్డి

నరసరావుపేట: ఆధునిక సాహితీ యుగకర్త, మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు జన్మించి 116 ఏళ్లవుతున్నా ఇప్పటికీ తెలుగు సాహిత్య ఆకాశంలో సూర్యునిలాగే ప్రభవిస్తూ ఉన్నారని ఎస్‌కేఆర్‌బీఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీశ్రీ 116వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శతాబ్దం నాది అని గర్వంగా ప్రకటించిన వ్యక్తి మహాకవి శ్రీశ్రీ అని కొనియాడారు. ఇప్పటికీ శ్రీశ్రీ సాహిత్యాన్ని కొలిచే పరికరాలు లేవని కవి చలం అన్నారని గుర్తుచేశారు. సామాన్యుడిని శ్రీశ్రీ తన కవిత వస్తువుగా చేసుకొని సమాజంపై తనదైన ముద్ర వేశారని అన్నారు. శ్రీనాథ్ సాహితీ పరిషత్తు కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీ తెలుగు చిత్రసేవకు సీమకు ఎంతో సేవచేశారని, 1946 నుంచి 1983 వరకు వారు ఎన్నో సినిమాలకు మాటలు, పాటలు, స్క్రీన్ ప్లే రాశారని చెప్పారు. ఆంగ్లం, తమిళ, హిందీ చిత్రాలను తెలుగులోకి అనువదించారని, అల్లూరి సీతారామరాజు చిత్రంలో పాడవోయి భారతీయుడా పాటకు జాతీయ స్థాయి అవార్డు వచ్చిందని, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు మహాప్రస్థానానికి వచ్చిందని గుర్తుచేశారు. ఇంకా మరో ప్రస్థానం, ఖడ్గసృష్టి,, గురజాడ వంటి అనేక ఖండకావ్యాల్ని రాశారని తెలిపారు. రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు బత్తుల మురళి మాట్లాడుతూ శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి పెద్ద ఆస్తి అని, వారు 1983లో నరసరావుపేట వచ్చారని, వారిని చూసే అదృష్టం తనకు కలిగిందన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు కృష్ణయ్య శ్రీశ్రీ యొక్క విశిష్టత, వారి సాహిత్యంలోనే ఆధునిక అంశాలను వివరించారు. జగన్నాథ రథచక్రాలు, మహాప్రస్థానానికి ముందుమాట మొదలైన అంశాలపై ప్రసంగించారు. పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి శ్రీశ్రీ పద్యాలు పాటలపై వివరించారు. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సంయుక్త కార్యదర్శి షేక్ బాజీ సాహిత్యాన్ని శ్రీశ్రీ తనకి ముందు తరం, తన తర్వాత తరంగా మార్చి తెలుగు సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించారని అన్నారు.

# రైతులకు నూతన పాస్‌బుక్‌లు అందజేయాలి

**ప్రజాసంఘాల నాయకుల డిమాండ్**

నరసరావుపేట: రైతుల పొలాలకు ఈ ఏప్రిల్ ఒకటి నుంచి నూతన పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఏప్రిల్ వెళ్లిపోతున్న పాసుపుస్తకాలు ఊసేలేకుండా చేసిందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, గిరిజిన సంఘ రాష్ట్ర నాయకుడు వి.కోటానాయక్ మాట్లాడారు. దీనిపై రైతులు రెవెన్యూ అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం చెప్పడంలేదని, అలాగే రీ సర్వేలో ఒకరి భూములు మరొకరికి ఎక్కించి రైతులను అనేక ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక రైతులకు సరైన సమాధానం చెప్పకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకోవటం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏడి ఆఫీసుల్లో పెండింగ్‌లో ఉన్నవన్నీ సరిచేసేలా చూడాలని, రైతులు రుణాలు తీసుకోవాలన్న పాస్ పుస్తకాలు లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పాల్గొన్నారు.

### గుమ్మడికి ఎక్సలెన్సీ అవార్డు



వినుకొండ: ప్రముఖ సామాజిక సేవ కార్యకర్త, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు గుమ్మడి వెంకటేశ్వర్లుకు బెంగళూరుకు చెందిన మదర్ థెరిస్సా ఫౌండేషన్ వారు మదర్ థెరిస్సా ఇండియన్ ఎక్సలెన్సీ అవార్డు -2025 ప్రకటించినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. గత 22 సంవత్సరాల నుంచి 7 వేల పైచిలుకు కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డు ప్రకటించినట్లు ఆయన వివరించారు. అవార్డు పొందిన గుమ్మడిని పట్టణ ప్రముఖులు, కళాకారులు, అభిమానులు అభినందించారు.

### ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

నూజెండ్ల: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గించటంతో పాటు మేలైన ఉత్పత్తులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకులు సైదయ్య అన్నారు. మండలంలోని మారెళ్ళవారిపాలెం గ్రామంలో గ్రామసభ, ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానం ద్వారా భూమిలో కార్బన్ శాతం తగ్గి పైరులో వాడే రసాయన ఎరువులు మొక్కలు తీసుకోలేక చీడపీడలు వ్యాపిస్తాయన్నారు. రైతులు నవధాన్యాల పండించే విధానం ద్వారా భూమిలో ఉత్పాదక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ శివనాగలక్ష్మి, సీసీలు వెంకట్రావు, హనుమంత రావు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.